సాక్షి
ఆదిలాబాద్
గురువారం : 11 : ఏప్రిల్ : 2024



మహా సంకల్ప పాదయాత్ర షురూ

బంజారా జాతీయ దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని బంజారా కాశి పొరాదేవి పుణ్యక్షేత్రం వరకు సేవాలాల్ భక్తులు మహా సంకల్ప పాదయాత్ర చేపట్టారు. 8లో▸

కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: ముస్లింలకు కలెక్టర్ రాజర్షి షా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పవిత్ర మాసమైన రంజాన్‌లో నెల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాహ్‌ను ప్రార్థించి ఆధ్యాత్మిక జీవనం కొనసాగించారని తెలిపారు. పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని ముస్లింలు పండగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా బుధవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్, మీడియా సెంటర్ ఏర్పాటు కోసం వసతులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు భద్రతాపరమైన అంశాలను నిశితంగా పరిశీలించి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగాల శ్రీరాములు, గొడం చందన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి శేషాద్రిని బుధవారం కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు సారయ్యదొర, సుధాకర్, ఈరులాల్, తదితరులున్నారు.

జిల్లా సదస్సు జయప్రదం చేయండి

ఎదులాపురం: ఉపాధి హామీ కూలీల సమస్యలు, పరిష్కార మార్గాలు అంశంపై జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 12న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో నిర్వహిస్తున్న సదస్సుకు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, సహాయ కార్యదర్శి ఆశన్న, నాయకులు భీంరావు, మంజుల, సచిన్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'పాయల్'



శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబీకులు

కైలాస్‌నగర్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం తొలిసారి కుటుంబ సమేతంగా తిరుపతికి వెళ్లిన ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పూలే జయంతిని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న మాలీ, బహుజన కులస్తులంతా కలిసి విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే కోరారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే విశ్రాంతి భవనంలో బుధవారం ఆయన మాట్లాడారు. స్త్రీవిద్య, సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. మాలీ మహా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్‌లో, 11 గంటలకు తలమడుగులో, సాయంత్రం 4.15 గంటలకు తాంసిలో పూలే జయంతికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో లొల్లి



గుడిహత్నూర్‌లో పార్టీకి మూకుమ్మడి రాజీనామా చేసిన బీజేపీ నాయకులు

- నలుగురు పార్టీ మండల అధ్యక్షుల తొలగింపు.. కొత్తవారి నియామకం
- ఏక పక్ష నిర్ణయమనే ఆరోపణ
- గుడిహత్నూర్‌లో పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు
- సన్నాహక సమావేశం మరుసటి రోజే..
- ఇన్‌చార్జి 'అభయ్' ఎదుట లోటుపాట్లు ఎత్తిచూపడంతోనన్న విమర్శలు

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా, పార్టీలో విపత్కర పరిణామాలు సద్దుమణగాల్సింది పోయి బీజేపీలో మరింత ముదురుతున్నాయి. జిల్లా కేంద్రంలో పార్టీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిలాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం ముగిసిన మరుసటి రోజే అంటే మంగళవారం బోథ్ నియోజకవర్గంలోని నలుగురు పార్టీ మండల అధ్యక్షులను తొలగించి కొత్తవారిని నియమించడం వివాదాస్పదం అయింది. తమకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. మరో పక్క గుడిహత్నూర్‌లో ఈ పరిణామాన్ని నిరసిస్తూ పార్టీకి చెందిన పలువురు మూకుమ్మడి రాజీనామా చేయడం గమనార్హం. పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్ సొంత నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఎన్నికల ముందు తలెత్తడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ఎందుకు తొలగించారు..?

పార్టీలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యనేతలు అతని వెనుకుండి నడుపుతున్నారని తొలగింపునకు గురైన అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. గుడిహత్నూర్ నుంచి జాడి సుభాష్, బజార్‌హత్నూర్ నుంచి బత్తిని సుధాకర్, బోథ్ నుంచి సుభాశ్ సూర్య, నేరడిగొండ నుంచి హీరాసింగ్‌ను పార్టీ మండల అధ్యక్షుల బాధ్యతల నుంచి తొలగిస్తూ ఇతరులను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడి నుంచి మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి చర్యలు పార్టీకి నష్టం కలిగిస్తాయని చెబుతూ, ఇది ఏకపక్ష నిర్ణయమని తొలగింపునకు గురైన నేరడిగొండ అధ్యక్షుడు హీరాసింగ్ బుధవారం విలేకరుల సమావేశం పెట్టి ఆరోపణలు చేశారు. మరో పక్క గుడిహత్నూర్ మండలంలో పార్టీ నిర్ణయాన్ని నిరసిస్తూ పార్టీకి చెందిన మండల శాఖ, వివిధ మోర్చాల నాయకులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంట్లో తొలగింపునకు గురైన జాడి సుభాష్ కూడా ఉన్నారు. కాగా మమ్మల్ని ఎందుకు తొలగించారని వారు ప్రశ్నిస్తుండగా, మంగళవారం జిల్లా అధ్యక్షుడు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కేవలం నాలుగు మండలాలకు అధ్యక్షులను నియమిస్తున్నట్లు తెలిపారే తప్ప వారిని ఎందుకు తప్పిస్తున్నారనే విషయంలో ఎలాంటి విషయం అందులో పొందుపర్చలేదు. ఈ పరిణామాలు ఇప్పుడు పార్టీలో హాట్‌టాపిక్‌గా మారాయి.



BHARATIYA JANATA PARTY
Rathange Brahmanand
President
PRESS RELEASE BY
APPOINTMENT OF MANDAL PRESIDENTS

మండల అధ్యక్షులుగా కొత్త వారిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడి నుంచి వెలువడిన ప్రకటన

లోటుపాట్లు ఎత్తి చూపారని ప్రచారం..

ఆదిలాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో నిర్వహించారు. తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో పాటు పార్లమెంట్ బాధ్యులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో నేరడిగొండ అధ్యక్షుడు హీరాసింగ్ పార్టీపరంగా జరిగే కార్యక్రమాలకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వడం లేదని ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా పోలింగ్ బూత్‌లత్ వారీగా ఓటర్ల జాబితా అందిందా అని అభయ్ పాటిల్ ప్రశ్నించినప్పుడు, ఇప్పటి వరకు తమకు ఎలాంటి జాబితా అందలేదని కార్యకర్తలు చెప్పినట్లు సమాచారం. దీంతో ఓ దశలో అభయ్ పాటిల్ పార్టీ ముఖ్య నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎన్నికలు దగ్గరపడ్డాయి.. ఇప్పటి వరకు పోలింగ్ బూత్‌వారీగా ఓటర్ల జాబితాను కార్యకర్తలకు పంపలేదు.. నేను ఇక్కడి వరకు వచ్చి ఏం లాభం.. ఇదే విషయంలో పైన రిపోర్టు చేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఓ దశలో ఆయన నేను వెళ్లిపోతానంటూ రుసరుసలాడగా పార్లమెంట్ బాధ్యులు కొంతమంది కలగ చేసుకుని పరిస్థితిని చక్క దిద్దుతామని చెప్పినట్లు పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. మొత్తంగా పార్టీకి చెందిన మండల అధ్యక్షుల తొలగింపు వ్యవహారంతో పార్లమెంట్ సన్నాహక సమావేశంలో జరిగిన అంతర్గత పార్టీ వ్యవహారాలు బయటకు వస్తున్నాయి.

అక్రమ డిప్యూటేషన్లపై కలెక్టర్ సీరియస్



ఆ ఇద్దరు.. కదలట్లే!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం



Therefore the Mandal Educational Officer Adilabad and HM ZPSS Utnoor U/M ... Telangana Sports School, Adilabad ...

District Educational Officer
Adilabad

హెచ్‌ఎంలకు డీఈవో ప్రణీత జారీ చేసిన మెమో

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్న వైనాన్ని వివరిస్తూ 'ఆ ఇద్దరు.. కదలట్లే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. డిప్యూటేషన్ రద్దయిన వారు ఎలా పనిచేస్తున్నారనే దానిపై వివరణ ఇవ్వాల్సిందిగా డీఈవో, జిల్లా యువజన, క్రీడల అధికారికి నోటీసులిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో సదరు ఉపాధ్యాయులకు సంబంధించి ఒరిజినల్ పోస్టింగ్ కలిగిన పాఠశాల హెచ్‌ఎంలకు నోటీసులు అందించారు. ఆ ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌కు సంబంధించి వాస్తవ వివరాలు అందించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా సదరు అధికారులు అందించే నివేదికల ఆధారంగా కలెక్టర్ తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తదితరులు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

కైలాస్‌నగర్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో తాగునీరు, సీఎంఆర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అంశాలపై హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రెండు వారాలు కీలకమైనవని, సమస్యాత్మక హ్యాబిటేషన్లలో ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరి కోతల నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. వానాకాలం 2023–24కు సంబంధించి సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి బియ్యం డెలివరీ చేసేలా ప్రతి జిల్లాలో రైస్‌మిల్లుల పనితీరును పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో వడదెబ్బ కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రంజాన్

- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు
- ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు సిద్ధమైన ముస్లింలు



ఉట్నూర్‌లో నమాజ్ కోసం ముస్తాబైన ఈద్గా

ఉట్నూర్ రూరల్/నెన్నెల: రంజాన్ ఉపవాస దీక్షలు ముగిసాయి. ముస్లింలు అత్యంత పవిత్రంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించి బుధవారం నాటికి 30 రోజులు కావడంతోపాటు సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. రంజాన్ దీక్షల అనంతరం షవ్వాల్ మాసం మొదటి రోజు నిర్వహించుకునే పండుగే ఈద్–ఉల్–ఫితర్. ఈ రోజు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు.

ఫిత్రాదానం

పండుగ రోజు నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. ఉపవాసాల పాటింపులో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఈ లోపాలను పరిహారం చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు మంచి వస్త్రాలు ధరించి, మంచి వంటకాలు ఆరగించేవీలు కల్పిస్తూ ముస్లింలు దానం చేస్తుంటారు.

ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: రంజాన్ పండుగ పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గా మైదానం సిద్ధమైంది. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు డీఎస్పీ జీవన్‌రెడ్డి సైతం ఈద్గాను సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లుగా తెలిపారు. ఆయన వెంట సీఐలు సత్యనారాయణ, ఫణీందర్ తదితరులున్నారు.

'డయల్ 1950'కు స్పందన

- ఓటర్లు సమాచారం తెలుసుకునేలా, ఫిర్యాదు చేసేలా ఈసీ ఫోకస్
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- ఇప్పటివరకు 300కు పైగా ఫిర్యాదులు



ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం

నేరడిగొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు సమాచారం తెలుసుకునేలా ఈసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఏ సందేహం ఉన్నా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేస్తే చాలు.. అక్కడి సిబ్బంది ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. సంబంధిత అధికారులకు సమాచారం చేరవేసి తగు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 300కు పైగా ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. కంట్రోల్ రూం వద్ద 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో ఐదుగురు చొప్పున సిబ్బంది పనిచేస్తున్నారు.

ఓటు హక్కు కీలకం..

ఎన్నికలు ఏవైనా..ఓటు హక్కు కీలకం. ఇంతటి కీలకమైన ఓటు హక్కు మీకు ఉందా.. ఒకవేళ ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది..? కొత్తగా ఓటు హక్కు పొందాలంటే ఎవరిని సంప్రదించాలి.? ఏంచేయాలి.? అనే సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కలెక్టరేట్‌లో ప్రత్యేక సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఓటరు నమోదు సమస్యలతో పాటు ప్రచారంలో భాగంగా డబ్బు, మద్యం, కానుకలు వంటివి పంచినా నేరుగా ఫిర్యాదు చేసేలా టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 1950కు డయల్ చేస్తే చాలు యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా విడుదల చేశారు. నామినేషన్ల పర్వం ఈనెల 18 నుంచి 25 వరకు జరగనుంది. ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు వీలుగా ఈనెల 15 వరకు అవకాశం ఉంది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందా..? లేదా..? లేకపోతే ఎవరిని సంప్రదించాలి..? వారి ఫోన్ నంబర్, చిరునామా తెలుసుకోవాలంటే కంట్రోల్ రూంలో సంప్రదించవచ్చు. పోలింగ్ మే 13న జరగనుంది. అప్పటివరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేస్తే చాలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం సిబ్బందికి సమాచారం చేరుతుంది.

ఎలా పని చేస్తుందంటే..

ఎన్నికల సంఘం ఓటర్లు తమ సమాచారం తెలుసుకునేందుకు, ఫిర్యాదులకు గాను రాష్ట్ర వ్యాప్తంగా ఒకే టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఎక్కడి నుంచైనా ఈ నంబర్‌కు డయల్ చేస్తే కంట్రోల్ రూంకు సమాచారం వెళ్తుంది. అక్కడికి వచ్చిన కాల్ ఎవరూ లిఫ్ట్ చేయకపోతే ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి కనెక్ట్ అవుతుంది. ఇలా మనం చేసే ఫోన్ తప్పక కలిసేలా చర్యలు తీసుకున్నారు. ఓటరు చేయాల్సిందల్లా తమ చేతిలోని ఫోన్‌కు పని చెబితే చాలు. సిబ్బంది ఆ సమాచారాన్ని నమోదు చేసుకుని ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఫిర్యాదుదారుకు కావాల్సిన సమాచారం చేరవేస్తారు.

తీపి కబురు

- ఇక చౌక దుకాణాల్లో పంచదార పంపిణీ
- ఏఏవై కార్డుదారులకు కిలో చొప్పున..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రేషన్ షాపులో పంపిణీ చేస్తున్న బియ్యం(ఫైల్)

కైలాస్‌నగర్: చౌక ధరల దుకాణాల్లో ఇక నుంచి పంచదార సైతం తప్పనిసరిగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లను ఆదేశించింది. ఉచిత బియ్యంతో పాటు అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుదారులకు కిలో చొప్పున పంచదార అందించాలని సూచించింది. ఈ నిబంధన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ రేషన్ డీలర్లు చక్కెర కోసం కొన్నేళ్లుగా డీడీలు చెల్లించడం లేదు. పౌరసరఫరాల సంస్థ కూడా దీనిపై పట్టించుకోవడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో పంచదార రూ.46నుంచి రూ.48 పలుకుతుంది. దీన్ని కొనుగోలు చేయడం పేదలకు భారంగా మారుతోంది. దీన్ని గుర్తించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇక నుంచి అన్ని చౌక ధరల దుకాణాల్లో ఉచిత బియ్యం పంపిణీతో పాటు పంచదార కూడా అందించాలని ఆదేశించారు. దీంతో ఆయా కార్డుదారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

2014 నుంచి ఆగిన పంచదార పంపిణీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు రేషన్ కార్డుదారులకు చౌకధరల దుకాణాల్లో బియ్యంతో పాటు పంచదార, గోధుమలను ప్రభుత్వం అందించేది. ఏఏవై కార్డుదారులకు కిలో పంచదార రూ.13.50 చొప్పున అందించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014 నుంచి కార్డుదారులకు ఈ రాయితీతో కూడిన పంచదార సరఫరా నిలిచిపోయింది. మరోవైపు రేషన్ డీలర్లు డీడీలు చెల్లించడం మానేశారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ కూడా దృష్టి సారించకపోవడంతో చక్కెర, గోధుమలతో పాటు మరో ఆరు రకాల నిత్యావసర సరుకుల పంపిణీ నిలిచిపోయింది. కార్డుదారులకు ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే అందుతున్నాయి. అయితే తాజాగా ఏఏవై కార్డుదారులకు గతంలో మాదిరిగా రాయితీతో కూడిన చక్కెర అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

14.24 మెట్రిక్ టన్నుల పంచదార అవసరం

జిల్లాలో 14,245 అంత్యోదయ అన్నయోజన కార్డులున్నాయి. వీరందరికీ ఇక నుంచి రాయితీతో కూడిన చక్కెర పంపిణీ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ రేషన్ డీలర్లను ఆదేశించారు. ఒక్కో కార్డుకు కిలో చొప్పున అందించాలని సూచించారు. దీంతో జిల్లాలోని ఏఏవై కార్డుదారులకు 14.24 మెట్రిక్ టన్నులు అవసరమని ఆ శాఖ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే కమిషనర్ ఆదేశాలపై రేషన్ డీలర్లు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో అన్ని రకాలు కలిపి మొత్తం 1.91లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇందులో కేవలం అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు మాత్రమే పంచదార సరఫరా చేస్తే మిగతా కార్డుదారుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముందని అంటున్నారు. ఎఫ్ఏసీ కార్డుదారులకు సైతం రాయితీతో కూడిన పంచదార అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

మే కోటా నుంచి అందజేస్తాం

అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు రాయితీతో కూడిన పంచదార సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా చర్యలు చేపడుతున్నాం. ఏప్రిల్ బియ్యం కోటా ఇప్పటికే పంపిణీ జరుగుతుంది. మే నెల కోటాకు రేషన్ డీలర్ల నుంచి పంచదార కోసం డీడీలు తీసుకుని వాటిని జిల్లా పౌరసరఫరాల సంస్థకు పంపిస్తాం. ఎంఎల్ఎస్ పాయింట్లకు పంచదార సరఫరా చేయాల్సిన బాధ్యత ఆ సంస్థపైనే ఉంటుంది.

– కిరణ్‌కుమార్, డీఎస్‌వో

క్లుప్తంగా

పిడుగుపాటుతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

బజార్‌హత్నూర్: మండలంలోని మంజరం తండా గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందింది. నిస్తే నెహ్రూలాల్‌కు చెందిన ఎడ్లను పొలం పనుల తర్వాత రాత్రి కొట్టంలో కట్టి ఉంచాడు. అర్ధ రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లి చూడగా పిడుగు పాటుతో ఎద్దు మృతి చెంది కనిపించినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాళ్ల నొప్పులు భరించలేక ఆత్మహత్య



లచ్చిరాం మృతదేహం

తానూరు(ముధోల్): కాళ్ల నొప్పులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అవదుత్వార్ లచ్చిరాం (59) కొంతకాలంగా బోదకాల వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కాళ్ల నొప్పులు అధికం కావడంతో సర్జరీ చేయించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పంటచేనుకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ధర్మాబాద్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య గంగాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

భైంసారూరల్(ముధోల్): మండలంలోని కుంసరలో విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన మేడిపల్లి దేవేందర్ అనే రైతు రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోతకు రావడంతో ఇటీవల కూలీలతో కోయించి చేనులోనే కుప్పగా వేశాడు. బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగి పంట మొత్తం దగ్ధమైంది. ఘటనలో సుమారు రూ.2లక్షల మేర పంటనష్టం జరిగిందని రైతు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కై లాస్‌నగర్‌కు చెందిన బొడకుంటవార్ సాంబశివ్ అనే వృద్ధుడు కలెక్టర్‌చౌక్ నుంచి బస్టాండ్ వైపు మంగళవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో బైక్ నడుపుతున్న వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టడంతో వృద్ధుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో బుధవారం కేసు నమోదైంది. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

ఇప్పచెట్లపై గొడ్డలి వేటు



- అనుమతులు లేకుండానే ఇష్టారీతిన నరికేస్తున్న వైనం
- ముక్కలు చేసి విక్రయాలు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

సారంగపూర్: మండలంలోని అటవీ ప్రాంతాల్లో అక్రమార్కులు ఇప్పచెట్లను ఇష్టారాజ్యంగా నరికి లారీల్లో తరలిస్తున్నారు. సాధారణంగా పట్టాభూమిలో పెంచిన చెట్లను నరకడానికే అధికారులు సవాలక్ష ఆంక్షలు, అనుమతులు అంటూ ఇబ్బందులు పెడుతుంటారు. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే మండలంలోని జామ్, అడెల్లి, ధని, చించోలి(బి) తదితర గ్రామాలకు సమీపంలోని అడవిలో పెరిగిన ఇప్పచెట్లను నరికి చిన్నచిన్న ముక్కలుగా కోసి లారీల్లో తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దాదాపు 50 వరకు ఇప్పచెట్లు నరికివేతకు గురైనట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఏజెంట్లను నియమించుకుని...

అటవీ ప్రాంతాల్లో ఇప్పచెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయి. వాహనం అంతవరకు వెళ్తుంది.. తెలుసుకునేందుకు కలప వ్యాపారులు గ్రామాల్లో కొంతమందిని నియమించి సర్వే చేయిస్తారు. అలాగే పట్టా భూముల్లోనూ చెట్లు ఉన్నాయా లేదా అని ఆరాతీసి ఏజెంట్ల ద్వారా మధ్యవర్తిత్వం కుదుర్చుకుంటారు. వాటిని చూసిన తర్వాత లేబర్, లారీ, కలపకోసే యంత్రాలను వెంట తీసుకుని వచ్చి ఎంతపెద్ద చెట్లయినా గంటల్లోనే నరికివేసి ముక్కలుగా కోసి లారీల్లో కలప డిపోకు తరలిస్తారు. అక్కడి నుంచి దాబాహోటళ్లు, పెద్దపెద్ద రెస్టారెంట్లు, తదితర వాటికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం...

అటవీశాఖ నిబంధనల ప్రకారం ఏదేని చెట్టు రైతుల పట్టా ఉన్న పంటపొలంలో ఉండి వాటివల్ల ఏదైనా నష్టం ఉందని భావిస్తే అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అటవీ భూమిలో ఉన్న చెట్లను నరికివేయడానికి అటవీశాఖ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని నిబంధనలున్నాయి. కానీ కలప వ్యాపారులు మాత్రం రైతుల పంటపొలాల్లో ఉన్న చెట్లను సాకుగా చూపి వాటికి అనుమతులు తీసుకుని అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇప్పచెట్లను, అడవులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అటవీశాఖ నిబంధనల ప్రకారం పట్టా భూమిలో రైతుకు ఇబ్బందికరంగా ఉన్న చెట్లను తొలగించడానికి మాత్రమే అనుమతులు ఇస్తాం. అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికేందుకు అనుమతులు ఇవ్వడం కుదరదు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికితే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీదేవి, డీఆర్వో, సారంగాపూర్

‘బోరిగాం’ సందర్శించిన అధికారులు



ట్యాంకు శుభ్రం చేస్తున్న సిబ్బంది



మిషన్ భగీరథ నీటిని పరీక్షిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండాను బుధవారం అధికారులు సందర్శించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ‘ఇరవై రోజుల వుతోంది’ శీర్షికన ‘సాక్షి’లో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంపీవో నసీరుద్దీన్, మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, బోరిగాంతండాను సందర్శించారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించారు. మిషన్ భగీరథ నీటిని పరీక్షించి వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంద్రాదేవికి చైత్రమాస పూజలు



ఆలయం వద్ద పూజల్లో ఆదివాసీలు



నైవేద్యాలు తయారు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు బుధవారం చైత్రమాస పూజలు ప్రారంభించారు. ఇంద్రవెల్లి, గోండ్‌గూడ, పర్ధాన్‌గూడకు చెందిన వారు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ పూజలు నెల రోజుల పాటు కొనసాగుతాయని, ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలిరానున్నట్లు ఆలయ మహరాజ్ సూర్యారావ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు నాగోరావ్, జ్ఞానేశ్వర్, రాజు, ఇంద్రు, శంకర్, కోసుబాయి, అనుసూయబాయి తదితరులున్నారు.

మహా సంకల్ప పాదయాత్ర ప్రారంభం



దీక్ష భూమి వద్ద సేవాలాల్ మహరాజ్ పల్లకితో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి హెచ్ గ్రామంలోని బంజారా జాతీయ దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని బంజారా కాశి పౌరాదేవి పుణ్యక్షేత్రం వరకు వేలమంది సేవాలాల్ భక్తులు చేపట్టిన మహా సంకల్ప పాదయాత్రను బుధవారం దీక్ష గురువు సద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సేవాలాల్ భక్తులు దాదాపు 150 కిలోమీటర్లు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించాలని తెలిపారు. సేవాలాల్ భక్తులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఉట్నూర్ మండలం హస్నాపూర్ వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. మండలంలోని గంగాపూర్, తాడేహత్నూర్ గ్రామాల్లో పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. పాదయాత్రలో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖశ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ జాదవ్, ఐటీడీఏ ప్రకాశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్‌నాయక్, తదితరులున్నారు.

నామినేటెడ్ కాదు..చట్టసభల్లో పదవులు కావాలి

- ఆదివాసీ ఆరు తెగల నేతల డిమాండ్



అభివాదం చేస్తున్న ఆదివాసీ ఆరు తెగల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయ పార్టీలు ఆదివాసీల్లోని ఒకే తెగకు గుర్తింపునిస్తూ, తమను పట్టించుకోవడం లేదని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పొడ్, అంద్, మన్నెవార్ తెగలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు కాదని తమకు చట్ట సభల్లో గొంతెత్తే పదవులు కావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరు తెగల ఐక్యవేదిక సమావేశం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా సంఘాల రాష్ట్ర నేతలు హాజరై మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీలు గుర్తింపు నివ్వకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామన్నారు. తాము ఏ తెగకు వ్యతిరేకం కాదని, ఆయా పార్టీలు అన్ని తెగలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అవసరమైతే ఆరు తెగల్లోని ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావ్, జడ్కే పాండురంగ్, సట్ల అశోక్, మెస్రం బాపురావ్, ఖమ్ము, నగేశ్, ఆనంద్‌రావ్, భీముడు, సుధాకర్, శంకర్, ప్రేంకుమార్, సొనేరావ్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో గర్భిణి మృతి

- సిరికొండ మండలంలో ఘటన
- వివాహం అయిన ఏడాదిలోపే మృత్యువాత



విమలాబాయి(ఫైల్)

సిరికొండ: రక్తహీనతతో గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న ఎక్స్‌రోడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెందూర్ సాయికిరణ్‌కు గత ఏడాది మేలో ఇచ్చోడ మండలం బాదిగూడకు చెందిన విమలాబాయితో(25) వివాహం అయింది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. ప్రసవం కోసం ఇటీవల పుట్టింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు 108లో ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు ఆమెకు సాధారణ నొప్పులే అని వైద్యం అందించారు. అయితే సాయంత్రం గర్భిణికి కడుపు గట్టిపడిన విషయం కుటుంబ సభ్యులు సిబ్బందికి తెలుపడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు. 108లో రిమ్స్‌కు తరలించేలోగా మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఇచ్చోడ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండి, సకాలంలో వైద్యం అంది ఉంటే విమలాబాయి బతికి ఉండేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు సాగర్‌ను ‘సాక్షి’ఫోన్‌లో వివరణ కోరగా.. ‘వారం నుంచి నేను సెలవులో ఉన్నా.. అక్కడ ఏం జరిగిందో.. మంగళవారం ఎవరిని ఇన్‌చార్జిగా నియమించారో నాకు తెలియదు..’ అంటూ పేర్కొనడం గమనార్హం. కాగా, తీవ్ర రక్తహీనత, విరేచనాలతో గర్భిణి మృతి చెందినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని పొట్టపెల్లి కే గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బుధవారం గ్రామంలోని బెల్ట్ షాపును తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4,750 విలువైన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆల్‌ఇండియా సైనిక్ ఫలితాల్లో ప్రతిభ

కుంటాల: ఆల్ ఇండియా సైనిక్ ఫలితాలు బుధవారం వెలువెడ్డాయి. కుంటాలలోని సృజన విద్యానిలయం పాఠశాలకు చెందిన విద్యార్థులు బక్కి రోహిత్, సూర్యతేజ, ఓంకార్, అయాన్, సోహన్ చంద్ర, నిదితారెడ్డి, అభినంద్ ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపాల్ కొత్త కాపు గంగన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

భైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరికి జైలు



భైండోవర్ చేసిన ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో కొన్ని రోజులుగా అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరిని గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వారు తీరు మార్చుకోకుండా మళ్లీ దేశీదారు విక్రయిస్తుండడంతో ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన లావునే సుధాం, మహ్మద్ హాఫీజ్‌లను రిమాండ్‌పై జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా దేశీదారు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రంజాన్ సందడి



ఈద్గా మైదానంలో ఏర్పాట్లు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్లో రంజాన్ సందడి నెలకొంది. ఓల్డ్ బస్టాండ్ మార్కెట్ సముదాయంలో రోడ్లపై ట్రాఫిక్ రద్దీగా కనిపించింది. ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నమాజ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పేనీలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

వివాహిత ఆత్మహత్య



జ్యోత్స్న మృతదేహం

కడెం: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన బొద్దుపల్లి జ్యోత్స్న (27) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతు రు మరణంపై అనుమానం ఉందని మంచిర్యాలకు చెందిన మృతురాలు తల్లి సిబ్బిడి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలి పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లక్ష్మణ్ ఉపాధి నిమిత్తం ముంబైలో ఉంటున్నాడు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లతో పోలీసులు

సాక్షి స్పందన

జైనథ్: ‘సాంగ్విలో హైటెక్ ఇసుక తవ్వకాలు’ పేరిట ‘సాక్షి’లో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఈ మేరకు జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, సిబ్బందితో కలిసి ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. మండలంలోని సాంగ్వి గ్రామ సమీపంలోని పెన్‌గంగలో ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అలాగే పక్క గ్రామమైన కౌఠ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను సైతం రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక తవ్వకాలు, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌ఐ నితిన్, మైనింగ్ అధికారులు ఉన్నారు.





ప్రయాణం... ప్రమాదకరం



ప్రమాదమని తెలిసినా కొంతమంది ఆటోవాలాలు విద్యార్థులను పరిమితికి మించి వాహనాల్లో తరలిస్తున్నారు. ఆటోకు రెండు వైపులా బ్యాగులు ఉంచడంతో పాటు డ్రైవర్ సీటు లోనూ నలుగురైదుగురిని కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. అలాగే సాత్నాల మార్గంలో తగినన్ని బస్సులు లేకపోవడంతో ప్రజలు జీపులపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా డ్రైవర్లు పరిమితికి మించి టాప్‌పైన ఎక్కించుకుని మరీ తీసుకెళ్తున్నారు. ఏమాత్రం పట్టు తప్పినా పెనుప్రమాదం బారిన పడే అవకాశముంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్